సర్వీస్ రోడ్లలో పార్కింగ్ పరేషాన్!

- వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా సర్వీస్ రోడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందుల్లో పాదచారులు, వాహనదారులు

జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు వాహనాలకు అడ్డాగా మారింది. దీంతో పాదచారులు జాతీయ రహదారి వెంబడి నడుస్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రహదారి పక్కన వాణిజ్య, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్‌కు సరిపై పార్కింగ్ స్థలం లేకపోవడంతో సర్వీస్ రోడ్డు స్థలంలో వాహనాలు నిలుపుతున్నారు. దీంతో చుట్టు పక్కల కాలనీవాసులు కాలనీలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.





మదీనాగూడ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన వాహనాలు

మియాపూర్: సర్వీస్ రోడ్డు అందుబాటులోకి తీసుకురావాల్సిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మియాపూర్, మదీనాగూడ ప్రాంతాల్లో జాతీయ రహదారికి ఇరువైపుల సర్వీస్ రోడ్డు వ్యాపారాలు, పార్కింగ్ ఏరియాలుగా మారాయి.

- మియాపూర్, మదీనాగూడ జాతీయ రహదారికి ఇరువైపుల వాణిజ్య వ్యాపార సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, హోటల్స్, హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్ వందల సంఖ్యలో ఉన్నాయి.
- వీటికి పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో పాటు సెల్లార్‌లలో కూడా వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాలను రహదారి వెంబడి, సర్వీస్ రోడ్డులో పార్కు చేస్తున్నారు.
- చందానగర్‌లోని గంగారం నుండి ఆల్విన్ క్రాస్ రోడ్డు వరకు, ఆల్విన్ క్రాస్ రోడ్డు నుండి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు సర్వీస్ రోడ్డు అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రాంతంలో జాతీయ రహదారి పై వరకు అక్కడ ఉన్న వాణిజ్య వ్యాపార సంస్థలకు వచ్చే వినియోగదారులు వాహనాలను పార్క్ చేస్తున్నారు.
- రోజూ జాతీయ రహదారి వాహనాల రాకపోకలతో కిక్కిరిసిపోతోంది. దీంతో పాటు రోడ్ల పైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో జాతీయ రహదారి పై వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.
- మదీనాగూడలో రెండు సంవత్సరాల క్రితం సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద సర్వీస్ రోడ్డును కొంత దూరం నిర్మాణం చేపట్టి వదిలేశారు. సుమారు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న సర్వీస్ రోడ్డు పనులు చేపట్టడం లేదు.
- దీంతో ఆ రోడ్డు పక్కన వాహనదారులు వాహనాలు ఆపుతున్నారు. రహదారి వెంబడి పాఠశాలలు ఉండడంతో పిల్లలను తీసుకెళ్లేందుకు తల్లి దండ్రులు నరకయాతన పడుతున్నారు. సర్వీస్ రోడ్డు అందుబాటులో లేకపోవడంతో కొంత మంది వాహనదారులు జాతీయ రహదారి పై యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వెళ్లి రోడ్డు అవతలికి వెళ్తున్నారు. ఈ క్రమంలో యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. సర్వీస్ రోడ్డు, జాతీయ రహదారి పై వరకు వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో నిత్యం రోడ్డు పై ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్న ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- మియాపూర్ మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్ నుండి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించడంతో పాదచారులు జాతీయ రహదారి వెంబడి నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డులో వ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌లను తొలగించి సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 60, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 35, దోస 40, ఆలు 25, చామ 45, కీర 25, బీర 50, వంకాయ 40, గోకర 45, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 280, వెల్లుల్లి 200 ప్రకారం ధర పలుకుతున్నాయి.

'ఫెమినా మిస్ ఇండియా'ల సందడి



గచ్చిబౌలి: కొండాపూర్‌లోని క్రీమ్‌స్టోన్ ఐస్ క్రీమ్స్ స్టోర్‌లో ఫెమినా మిస్ ఇండియాలు సందడి చేశారు. శనివారం ఫెమినా మిస్ ఇండియా–తెలంగాణ–2023 ఊర్మిలాచౌహాన్, గ్లామ్మన్ మిస్‌ఇండియా సెకండ్ రన్నరప్–2023 షషిషావసీమ్‌లు సందడి చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టోర్‌లో రకరకాల ప్రసిద్ధి చెందిన ఐస్‌క్రీమ్‌ల ఆఫర్లను వారు ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవాన తక్కువ ధర ఆఫర్లలో ఐస్‌క్రీమ్‌లను అందిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: చిత్రకళాకారుడు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఎల్.ఎన్.వి.శ్రీనివాస్ వేసిన చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో 23 చిత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

మహా ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు



రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో తరలివెళుతున్న పార్టీ శ్రేణులు

గచ్చిబౌలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మహాధర్నాకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. శనివారం మసీద్‌బండ నుంచి బీజేపీ కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌కు తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రాఘవేంద్రరావు, రాధా కృష్ణ యాదవ్, ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, మధు యాదవ్, గణేష్, భరత్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి



రామయ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన కూకట్‌పల్లి డివిజన్‌లోని రామయ్యనగర్‌లో పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సీసీ రోడ్డు నిర్మాణం జరగలేదని, వీధి దీపాలు వెలగటం లేదని, పారిశుద్ధ్య సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, చందు, రామచంద్రరావు, ఆంజనేయులు, ప్రభాకర రావు, భాస్కర్‌రావు, హనుమంత్‌రావు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కాంగ్రెస్ పాత్ర కీలకం



నేతాజీనగర్‌లో జోడోయాత్రలో పాల్గొన్న రఘునాథ్‌యాదవ్

శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర మరువ లేనిదని, కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతోనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మోహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్‌లో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా రెండవ రోజు ఆయనకు స్థానికులు హారతుల పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఇచ్చిన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం కల్పించాలన్నారు. శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు.

ఓటు నమోదు చేయించుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సూచించారు. మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీల ప్రజలకు వద్దకు వెళ్లి ఓటు నమోదు కానివారి వివరాలను అధికారులు సేకరించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో సంకీర్తనాలాపన



మాదాపూర్: చిన్నారి కళాకారులు అన్నమయ్య కీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమాచార్య భావనా వాహిని అధ్యక్షుడు, పద్మశ్రీ డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో బృందా రవి శిష్యులు కీర్తనలను ఆలపించి అలరించారు. బ్రహ్మకడిగిన పాదము, గోవింద గోవింద, చక్కని తల్లికి చాంగుభళా, మాధవా కేశవా, తందనానా అహి, అదివో అల్లదివో అంటూ అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. కళాకారులు శిరీష, శ్రీలక్ష్మీ, అక్షర, విద్యా, ప్రసన్న, రేణుధాత్రి, ప్రతిభ, ప్రద్యుమ్న మనోజ్, శ్రీనిధి, హాసిని, హైందవి తదితరులు పాల్గొన్నారు. కీ బోర్డుపై ఆర్.శ్రీనివాస్, తబలాపై ఆర్. విజయబాబు, వేణుగానం ఎం.ఉమాశంకర్ సంగీత సహకారాన్ని అందించారు. అనంతరం కలాకారులను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



మాదాపూర్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని హైకోర్టు ప్లీడర్ కార్తికేయ తెలిపారు. మాదాపూర్‌లోని నారాయణ ఉన్నత పాఠశాలలో కేబినెట్ సంస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్తికేయ మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల మానసిక, భావోద్వేగ అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు ప్రదానం చేశారు. కేబినెట్‌లో ఎన్నికైన విద్యార్థులు కవాతు నిర్వహించి గౌరవ వందనాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ రోహిణి, కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత, కర్తవ్య భావన పెంపొందాలని ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న రవికుమార్‌యాదవ్, రఘువేంద్రరావు తదితరులు

గచ్చిబౌలి: ఆజాదికా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా మేరీ మాటి–మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మసీద్‌బండలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి అమృత కాల పంచ ప్రాణాల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన భారత దేశమే లక్ష్యంగా ప్రతి అంశంలో బానిసత్వం నుంచి విముక్తి పొందాలని ఆకాంక్షించారు. ప్రజల్లో కర్తవ్య భావన పెంపొందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రఘువేంద్రరావు, రాధా కృష్ణ యాదవ్, ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, మధు యాదవ్, గణేష్, భరత్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వాళ్లకేనా దళితబంధు?

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: ఎన్నికల సమయంలోనే సీఎంకు దళితులు గుర్తుకొస్తారా? అధికార పార్టీ వాళ్లకేనా దళిత బంధు? అని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని దళిత కుటుంబాలకు దళితబంధు ఇవ్వాలని బీరంగూడ మండే మార్కెట్ నుంచి శివాలయం చౌరస్తా వరకు ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన దళితులకే దళితబంధు పథకానికి ఎంపిక చేస్తున్నారని వాపోయారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి కుటుంబానికి దళితబంధు అమలు చేసేవరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్స్, శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, వడ్డె కృష్ణ, నర్సింగ్‌రావు, అశోక్ ముదిరాజ్, మున్సిపాలిటీ వైస్ ప్రెసిడెంట్ మన్నె రవీందర్, కౌన్సిలర్లు లావణ్య శశిధర్‌రెడ్డి, సునీత, ట్రెజరర్ సుధాకర్‌యాదవ్, జనరల్ సెక్రటరీలు సలీం, కుమారి, మహేష్, రమేష్‌యాదవ్, సంగారెడ్డి జిల్లా మైనారిటీ చైర్మన్ హబీబ్‌జానీ, సంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ప్రవీణ్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.



రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న నాయకులు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

జిన్నారం(పటాన్‌చెరు): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. హరితహారంలో భా గంగా బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభు త్వ పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతామని తెలిపారు. కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను నమ్మొద్దు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దళితబంధు పథకంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా సీఎం కేసీఆర్ దళితుల ఆర్థికాభివృద్ధికి చారిత్రాత్మకమైన దళిత పథకాన్ని ప్రవేశపెట్టారని, విడతలవారీగా అర్హులైన దళితులందరికీ పథకాన్ని వర్తింపచేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మూడు గ్రామాల్లో 100 కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపచేశామని, నేడు ఆ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. మొదటి విడతగా నియోజకవర్గవ్యాప్తంగా 1100 మంది దళిత కుటుంబాలకు దళితబంధు అమలు చేయబోతున్నట్లు వివరించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

అరచేతిలో ఆర్టీసీ సమాచారం...

పటాన్‌చెరు టౌన్: గమ్యం యాప్‌తో ప్రయాణికులు సులభంగా ఆర్టీసీ బస్‌ల సమాచారం తెలుసుకోవచ్చని హెచ్‌సీయూ అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పించారు. బస్సు ఎక్కడుంది.. ఏ సమయానికి వస్తుందో యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చన్నారు. దీని ద్వారా సమయం ఆదా అవుతుందని, ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఇసాక్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైటెక్స్‌లో ఆకట్టుకుంటున్న దీప్‌మేళా



కొనుగోలు చేస్తున్న సందర్శకులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న దీప్‌మేళా ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ మేళాలో ప్రత్యేకంగా తయారు చేసిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఉడ్‌తో తయారు చేసిన గిఫ్ట్ బాక్స్‌లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆభరణాలు, గృహోపకరణాలు, వస్త్రాలు, హ్యాండ్ బ్యాగ్‌లు తదితర ఉత్పత్తులు మేళాలో అందుబాటులో ఉన్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేత్రపర్వం.. కూచిపూడి నృత్యం



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం ప్రవాస భారతీయ కళాకారులు కౌశిక నవలే, ఆశిక నవలే లు కూచిపూడి ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో రుక్మిణి ప్రవేశ దరువు, వసంత జతిస్వరం, ఒకపరిఒకపరి, అంశాలను ప్రదర్శించి అలరించారు. ప్రముఖ కూచిపూడి నాట్యగురువు ప్రతిభరాజ్ గౌడ్ శిష్యబృందంచే ఆనంద నర్తన గణపతి, మహేశ్వరి, మహాకాళి, జతిస్వరం, దశావతారం, రామాయణశబ్దం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు సంజన, నేహ, కీర్తన, పూజ, వర్షిణి, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి, యువత, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కొలపురి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ప్రతినిధుల బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థి సమస్యలు, యువత అభివృద్ధి అంశాలపై సమగ్రంగా విద్యార్థి సంఘాలతో మాట్లాడామన్నారు. విద్యార్థి, యువత, నిరుద్యోగుల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఓబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హెచ్‌సీయూ నాయకుడు వై.శివకుమార్‌ముదిరాజ్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీలలోని సమస్యల పరిష్కారం కావాలంటే ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో విద్యార్థి, నిరుద్యోగ యువత సమస్యలపై స్పష్టమైన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ నర్సింహా మాట్లాడుతూ... రాష్ట్రంలోని నిరుద్యోగ, విద్యార్థి, యువత అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్ర వ్యాప్తం పర్యటన చేపట్టినట్లు పేర్కొన్నారు. తెలంగాణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడ వంశీనాయక్, హెచ్‌సీయూ బీఎస్ఎఫ్ నాయకులు, రీసర్చ్ స్కాలర్స్ పరశురామ్, రమేష్, ఏటీబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, బొమ్మెన అనిల్‌కుమార్, అరుణ్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్‌వెస్ట్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయినగర్ వెస్ట్ కాలనీలో ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు నెంబర్9,10లో డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేసి, సీసీ రోడ్డు చేపట్టాలని, పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే విధంగా రోడ్డు నెంబర్ 6,8,11లలో డ్రైనేజీ లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజేష్ చంద్ర, శివరాజ్‌గౌడ్, ప్రభాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై దర్యాప్తు ముమ్మరం



సీసీ ఫుటేజీలో వివాహితను తీసుకువచ్చిన దృశ్యం

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పదంగా మృతిచెందిన వివాహిత మృతి కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సుధారాణి శుక్రవారం మృతి చెందింది. మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి సుధారాణిని తీసుకువచ్చి.. గుట్టుచప్పుడు కాకుండా జారుకున్న వ్యక్తి ఎవరనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను సేకరించారు. వచ్చిన వ్యక్తి ఎందుకు భర్త అని చెప్పాడు, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు జారుకున్నాడు అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. ఏడు నెలలుగా శాంతినగర్‌లో ఉంటున్న సుధారాణి, భర్త రామకృష్ణకు కుటుంబ తగాదాలు ఏమైనా ఉన్నాయా, మృతికి గుర్తుతెలియని వ్యక్తికి ఏమైనా సంబంధం ఉందా, ఆర్థిక ఇబ్బందులు కారణమా..? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోపక్క సుధారాణి ఆత్మహత్య చేసుకుందా, లేక ఎవరైనా ఉరి బిగించారా అని తెలుసుకునేందుకు పోస్టుమార్టం నిర్వహించి, ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపారు.